ఎలాంటి స్వార్థం లేకుండా స్నేహం కోసమే స్నేహం చేసే, నాకు తారసపడ్డ ఏకైక వ్యక్తి బెనర్జి. స్కూల్లో చదువుకున్నప్పటి కాలంలోని ఫ్రెండ్స్‌ని కూడా అతను పోగొట్టుకోకుండా 'టచ్'లోనే వున్నాడు.

అతన్ని చూస్తే అనిపిస్తుంది నాకు, 'ఈ ప్రపంచంలో అపరిచయస్థులంటూ ఎవరూ వుండరు, మనని మీట్ అవడానికి వెయిట్ చేసే స్నేహితులే తప్ప' అని. అందుకే ప్రేమ కన్నా ఫ్రెండ్‌షిప్ గొప్పది. దాన్ని వయసుతో పని లేకుండా ఎక్కువ కాలం కొనసాగించవచ్చు. అకారణ ద్వేషం అధికం అవుతున్న ఈ కాలంలో అందరూ గుర్తుంచుకోవాల్సింది ఒకటుంది. ఎంత నిరుపయోగమైన వ్యక్తి స్నేహం అయినా, అతనితో శతృత్వం కన్నా గొప్పది.

తన కేలండర్‌లో తమ మిత్రుడికి కొంత సమయం కేటాయించ గల వ్యక్తి స్నేహం ఇంకా గొప్పది. ఎందుకంటే స్నేహితుడు సంతోషాన్ని రెట్టింపు చేసి, దుఃఖాన్ని సగం చేస్తాడు.

## ఆనందం అంటే?

**ఆ**నందం అనేది వాస్తవం కాదు. ఓ మనిషిపాయింట్ ఆఫ్ వ్యూ. ఓ ఏంగిల్ నించి చూస్తే ఓ సంగతి ఓ మనిషికి ఆనందాన్ని కలిగిస్తే అది ఇంకొకరికి అంత ఆనందాన్ని కలిగించకపోవచ్చు. కాబట్టి ఆనందం రెలిటివ్ ఫీలింగ్ మాత్రమే.

పదిలక్షలు లాటరీ తగలడం, బంగారం బిస్కెట్లు పెట్టె రైల్లో దొరకడం, కోటీస్వర రూపాయల విలువచేసే తాతయ్య ఆస్తి మొత్తం మనకే రావడం అందరికీ ఆనందాన్ని కలిగిస్తుంది. అలాంటి ఆనందాల గురించి కాదు నేను ప్రస్తావించేది. అవి అందరికీ జీవితకాలంలో ఒక్కసారయినా జరక్కపోవచ్చు. కాని చిన్న చిన్న విషయాలు

అనుకోకుండా జరిగితే మనుషులు పొందే ఆనందాల గురించి నేచెప్పేది. ఇలాంటి ఆనందాలు తరచు కలుగుతుంటే అంతకుమించిన గొప్ప ఆనందం ఇంకోటి ఉండదు అని నా అభిప్రాయం. కొన్నిటిని చిత్తగించండి.

* నా ఎనిమిదిమంది పిల్లలూ వంకాయకూరని సయించదనకుండా తినడం.
 — ఓ తల్లి
* నా ఆఖరి కొడుకు స్కూల్లోంచి నన్ను చూసి చేతిలోని ప్రోగ్రస్ రిపోర్టు కార్డుని ఊపుతూ ఆనందంగా నా దగ్గరికి పరిగెత్తుకు రావడం.
 — మరో తల్లి
* ఆనందం అంటే నా తండ్రి, భర్త కొడుకు మిడిల్ ఈస్ట్‌వార్ నించి ప్రాణాలతో తిరిగిరావడం.
 — అమెరికన్ మహిళ
* 'సారి డార్లింగ్, నిన్న నేను చేసింది తప్పే' అని నా భర్త మర్నాడు తన తప్పు వప్పుకోవడం.
 — ఓ భార్య
* 'రేపు వచ్చి జాయిన్ అవు' అన్న మాటలు వినడం.
 — నిరుద్యోగి
* పార్టీలో నా భర్త మనుషుల మధ్య దూరం నించి చూసి నాకు కన్నుకొట్టడం.
 — 83 ఏళ్ళ భార్య
* సూదిలో ఒకే ప్రయత్నంలో దారం గుచ్చగలగడం.
 — 89 ఏళ్ళ భర్త
* వేడి వేడి ఉల్లి పకోడీలు, వర్షం, విజయా వారి 'మాయాబజార్' కేసెట్.
 — 43 ఏళ్ళతను
* గత నెలలో బరువు తూచే యంత్రం ఇచ్చిన టిక్కెట్‌మీద 72 కిలోలుండి, ఈనెల్లో 60 కిలోలు ఉండడం.
 — వెయిట్‌వాచర్
* 26 ఏళ్ళ క్రితం ప్రేమించిన అమ్మాయి అకస్మాత్తుగా కనపడి

ఆప్యాయంగా పలకరించడం.

— 46 ఏళ్ళ భగ్నప్రేమికుడు

* ఆదివారం ఇంటినిండా చుట్టాలుండి పనితో సతమతమవుతున్నప్పుడు టివి. పాడవడం.

— ఇల్లాలు

* పిల్లలు ఫస్ట్‌షోలో. ఇంటిబయట తాళం. నేను మావారు బెడ్‌రూంలో.

— పిల్లలతల్లి

* బేరర్ చెక్ బేంక్‌లో ప్రజెంట్ చేసిన అయిదు నిమిషాలకే రూల్స్ ప్రకారం కాష్ తీసుకోగలగడం.

— ఓ వ్యాపారి

* టీనేజ్ కొడుకు పంట్లాం నాకు సరిపోవడం.

— 47 ఏళ్ళ తండ్రి

* మూడురోజులు జ్వరంపడి లేచాక ఆరేళ్ళ కొడుకు వచ్చి "మమ్మీ డాడీనేమో వంటగది వాసనొచ్చేలా చేసారు కాని నువు బాగుచెయ్యి" అనడం.

— నలుగురు పిల్లల తల్లి

* మా ఆస్తిమీద వ్యాజ్యం వేసినవాడు రోడ్డు దాటుతుండగా, ఎదురుగా నలుగురు గుడ్డి డ్రయివర్లు తమ లారీలని అతని మీదకి నడుపుతూ రావడం.

— ఆరేళ్ళగా కోర్టు చుట్టూ తిరిగే అతను

* పధ్నాలుగేళ్ళ వివాహ జీవితానంతరం నాకూతురు నెలతప్పిందన్న టెలిగ్రాం చదవడం.

— 58 ఏళ్ళావిడ

* హెచ్. డి. ఎఫ్. సి. నించి ఇంటికోసం తీసుకున్న రుణం తాలూకు ఆఖరి ఇన్‌స్టాల్‌మెంట్‌ని చెల్లించడం.

— 56 ఏళ్ళ ఆడపిల్లల తండ్రి

* మొదటి కథని అంగీకరిస్తున్నట్లు పత్రిక వాళ్ళనించి లెటర్

రావడం.

— ఔత్సాహిక రచయిత

* ఆడపడుచు లిద్దరు నెలాఖరున సినిమాకి తీసుకెళ్ళమన్న రోజు భారత్‌బంద్ జరగడం.

— ఓ ఇల్లాలు

* తండ్రివెంట ఆరేళ్ళ కూతురు వారం ఉండి వస్తానని వూరు వెళ్ళాక ఆ కూతురి తల్లికి 'వెంటనే బయల్దేరు. అమ్మాయ్ నీకోసం బెంగపడింది' అన్న టెలిగ్రాం రెండోరోజు రావడం.

— ఓ తల్లి

* వేసవికాలం మొదటిసారి ఇంటికి కొనుక్కువచ్చిన మామిడిపళ్ళని చూసిన పిల్లల మొహాల్లోని ఆనందం చూడటం.

— ఓ తండ్రి

* పన్నెండేళ్ళ క్రితం ఆఖరిసారి చూసిన మిత్రుడు నించి ఈ పుట్టినరోజుకి గ్రీటింగ్ రావడం.

— మరో మిత్రుడు

* బంగారం ధర తులానికి నూట ఇరవై రూపాయలు తగ్గిందని తెలుసుకోవడం.

— పిల్ల పెళ్ళి కుదిరిన తండ్రి

* కేన్సర్ అని భయపడ్డం, పరీక్షలో అతని తల్లికి కేన్సర్ కాదని తేలడం.

— ఓ నిరుద్యోగి

* మా ఆయన తద్దినం నా తొమ్మిదిమంది కొడుకులు ఏటా కలిసి ఒకే ఇంట్లో పెట్టుకోవడం.

— ఓ ఛాందసురాలు

* ఇక తిరిగి రాదనుకున్న బాకీ వసూలవడం

— ఎవరికయినా

* కవరుమీది రూపాయి స్టాంపుకి ముద్ర పడకుండా రావడం.

— కొందరికి

* నా చిన్నప్పుడు ఆడుకునే కొండపల్లి బొమ్మలసెట్ ఇరవై ఏళ్ళ తర్వాత ఇంట్లో అటకమీద దొరకడం.

— పెళ్ళికావలసిన అమ్మాయి

* మా ఇంటికొచ్చే వారపత్రికని పక్కింటివాళ్ళకన్నా ముందు నేనే చదవడం.

— చందాదారుడు

* మా ఇంటి సందులో పాడయిన కారులో చిరంజీవి ఉండటం, అతను ఓ గ్లాసు ఫ్రిజ్‌వాటర్ తెచ్చిపెట్టమని నన్నే అడగడం.

— పదేళ్ళ కుర్రాడు

* డజను మూడురూపాయల చొప్పున ఆరు ముంజలు కొన్నప్పుడు ఏడో ముంజని కొసరుగా ఇవ్వడం.

— ఏడుగురు పిల్లల తల్లి

* మేడమీంచి కళ్ళజోడు కిందపడ్డా అది పగలకుండా ఉండటం.

— మధ్యవయస్కుడు

* పెళ్ళిలో ఆఖరి పంక్తిలో కూర్చున్నప్పుడు, లడ్డూ మారు వడ్డించినప్పుడు, నా విస్తరిలో లడ్డూలు అయిపోవడం.

— లడ్డూప్రియుడు

* మరదలి ముందు తినే మిరపకాయబజ్జీలోని మిరపకాయ కారంగా లేకపోవడం.

— కొత్తగా పెళ్ళయినవాడు

* మావారు మా శోభనంనాటి చీర రంగుని ఇంకా గుర్తుంచుకోవడం.

— 36 ఏళ్ళ భార్య

* సైకిల్ వచ్చి గుద్దుకుంటే, మారుతికారుకి కాక సైకిల్‌కే దెబ్బలు తగలడం.

— మారుతీ కారు ఓనర్

* మిట్టమధ్యాహ్నం మే 13న రైల్లో ప్రయాణిస్తుంటే, మన సీటుమీది ఫేన్ పనిచేయడం, దాని గాలి కేవలం మనకే తగలడం.

— రైలు ప్రయాణీకుడు

* పోస్టాఫీసులో మర్చిపోయిన డిగ్రీ సర్టిఫికేట్ వున్న ఫైల్, గంటన్నర తర్వాత గుర్తొచ్చి వెళ్ళి చూస్తే కనబడటం.

– ఓ నిరుద్యోగి

* పక్కింటివాళ్ళు నేను నిద్రలేచేలోగా ఆంధ్రభూమి శుక్రవారం సంచికని చదివి, పేజీలని యథాతథంగా అమర్చి, నలగకుండా తిరిగి మా ఇంట్లో ఇవ్వడం.

– మల్లాది

# పెళ్ళికాని అమ్మాయిలకి మాత్రమే

ఇదివరకటి రోజుల్లో పిల్ల పెద్దమనిషి కాకుండా పెళ్ళిళ్ళు చేసేవారు. తర్వాత ఇరవై ఏళ్ళు మించకుండా వివాహం చేసేవారు. ఇప్పుడు కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకి పాతికేళ్ళు వచ్చినా వివాహం చేయలేకపోతున్నారు. కొందరు ఆడపిల్లలు తమ భర్తలను తామే వెదుక్కోవాల్సిన పరిస్థితి కూడా వచ్చేసింది.

"కట్నం యివ్వలేం, మన శాఖవాడు కాకపోయినా ఫర్వాలేదు. కాని మన కులం వాడెవడు నిన్ను పెళ్ళి చేసుకుంటానన్నా, నీకు నచ్చితే మాకు నచ్చినట్లే" అని తమ కూతుళ్ళతో అన్న తల్లితండ్రులు నాకు తారసపడ్డారు.

"ప్రేమ కట్నం కోరదు" అన్నది కొన్ని సందర్భాల్లో నిజం అవుతోంది. తెలివయిన అమ్మాయి పెళ్ళి చేసుకోవాలని చూస్తే, తెలివిగల అబ్బాయి పెళ్ళిని ఎవాయిడ్ చేయడానికి చూస్తాడు.

ఇంట్లో కూర్చుని టి.వి. చూసి వారపత్రికలు చదువుకునే బదులు కొందరమ్మాయిలకి 'మనమూ ప్రేమించి పెళ్ళి చేసుకుంటే పోలా?' అనిపించచ్చు. కాకపోతే వాళ్ళకి ప్రేమించడానికి అర్హుడయిన అబ్బాయి తారసపడకపోవచ్చు. ఒకవేళ తారసపడ్డా పరిచయం